సాక్షి
నిర్మల్

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



ఆలయంలో కొలువైన మల్లన్న దేవుడు



బోనాలతో ఊరేగింపుగా మల్లన్న ఆలయానికి వస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

సమస్యలు విని.. పరిష్కారానికి ఆదేశించి..

- భైంసా 'ప్రజావాణి'లో ఎస్పీ జానకీషర్మిల



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల బుధవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలువురు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు సావధానంగా విని చట్టరీత్యా పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ బుధవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు నిర్భయంగా, నేరుగా తనను కలిసి సమస్యలు విన్నవించవచ్చని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై అశోక్ ఉన్నారు.

ముగిసిన వార్షికోత్సవం



పుష్పాలంకరణలో గజ్జలమ్మదేవి

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయ వార్షికోత్సవం బుధవారం ముగిసింది. చివరిరోజు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చనతోపాటు పుష్పాలంకరణ చేశారు. గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో గజ్జలమ్మ దీక్షాపరులు మాల విరమణ చేశారు. వార్షికోత్సవ సందర్భంగా హుండీని లెక్కించారు. రూ.42,500 నగదు, గ్రామున్నర బంగారం, 560 గ్రాములు వెండి సమకూరిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

1104 యూనియన్ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 ఆవిర్భావ వేడుకలను విద్యుత్ శాఖ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల పోచయ్య యూనియన్ జెండా ఎగురవేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్లుగా యూనియన్ కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తోందన్నారు. కార్మికులు ప్రస్తుతం అనుభవిస్తున్న సౌకర్యాలన్నీ 1104 యూనియన్ పోరాడి సాధించినవే అని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొడాలి వెంకటరమణ, కార్యదర్శి టి.మనోహర్‌స్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోరిపెల్లి శ్రీనివాస్, జిల్లా సలహాదారు రేగుంట రాజేశ్వర్, డిస్కమ్ నాయకులు డి.రాజేశ్వర్‌రావు, ఎస్ఏ.రెహమాన్, రమాకాంత్, రఘు, మోహన్, నారాయణ్‌సింగ్, గోపి, అశోక్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ నిర్మల్ డిపోలో డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. ఈ శిక్షణ 30 రోజులు ఉంటుందని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లు శిక్షణ ఇస్తారని వెల్లడించారు. శిక్షణ అనంతరం టెస్ట్ నిర్వహించి సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణ పొందడానికి ఆర్టీసీకి బయటివారు రూ.15,600, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలైతే రూ.10 వేలు చెల్లించాలని తెలిపారు. వివరాలకు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌ను 7382842442 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.





సల్ల బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు



ఆలయం వెలుపల భక్తులు వెలిగించిన దీపాలు



పూనకాలతో ఊగిపోతున్న మహిళలు

సల్లంగ చూడు.. మల్లన్న

నిర్మల్ రూరల్ మండలం ముజ్గి గ్రామంలో బుధవారం మల్లన్న జాతర ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు ఈ జాతర కొనసాగనుంది. సాయంత్రం వివిధ గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో చల్ల కుండలతో పాదయాత్రగా వచ్చి స్వామివారికి పూజలు చేశారు. చల్ల నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్మల్, భైంసా, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు తులాభారం వేశారు. తలనీలాలు సమర్పించారు. డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం రథయాత్ర నిర్వహిస్తారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్మల్ రూరల్, దిలావర్‌పూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – నిర్మల్ రూరల్

దరిచేరనున్న కొలువు

- డీఎస్సీ–2008 బాధితులకు ఉద్యోగాలు
- హైకోర్టు ఉత్తర్వులతో వారంరోజుల్లో పోస్టింగు
- కాంట్రాక్టు ఎస్జీటీలుగా అవకాశం
- జిల్లాలో 15 మందికి న్యాయం..



నిర్మల్‌ఖిల్లా: డీఎస్సీ–2008 నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు కాంట్రాక్టు విధానంలో ఎస్జీటీలుగా వారం రోజుల్లోగా నియామకాలు పూర్తి చేయాలని హైకోర్టు తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జిల్లాలోని బాధిత అభ్యర్థుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నోటిఫికేషన్ అనంతరం తీసుకున్న నిర్ణయం మేరకు 30 శాతం పోస్టులు ప్రత్యేకంగా డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. మెరిట్ జాబితాలో ఉన్నా.. ఉద్యోగాలకు దూరమవడంతో కోర్టుల చుట్టూ తిరుగుతూ వస్తున్నారు. 16 ఏళ్ల న్యాయ పోరాటం.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వీరందరికీ మినిమం టైం స్కేల్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు విధానంలో నియమించనున్నారు. అయితే వీరందరికీ సాధ్యమైనంత త్వరగా పోస్టింగ్ ఇవ్వాలని గతంలోనే హైకోర్టు స్పష్టం చేసినా వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వస్తోంది.

సర్టిఫికెట్ల పరిశీలన..

ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన ఉమ్మడి జిల్లాల వారీగా పూర్తయింది. తాజాగా కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నియామకపు ఉత్తర్వులను వారం రోజుల్లో ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బాధిత అభ్యర్థులు కాంట్రాక్టు ఎస్జీటీలుగా నియామకం కానున్నారు.. జిల్లా నుంచి దాదాపు 15 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయినప్పటికీ నూతన జిల్లాల వారీగానే పోస్టింగ్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఎట్టకేలకు పోరాటం ఫలించడంతో అభ్యర్థులు గంగాధర్, ఇందూరు చంద్రశేఖర్, సుద్దాల రాజేశ్వర్, వినోద్, ప్రభ తదితరులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

రెండురోజుల్లో జీవో..

సుదీర్ఘ నిరీక్షణ అనంతరం బాధిత అభ్యర్థులకు న్యాయం చేకూరుస్తూ పోస్టింగులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళితో సంబంధం లేకుండా రానున్న రెండు రోజుల్లోనే నియామక ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు విడుదల చేయనున్నట్లు సమాచారం.

ఉద్యోగాలు ఇవ్వడం సంతోషం...





డీఎస్సీ 2008లో వెలువడిన నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్షలో ఎంపికై కౌన్సెలింగ్ సమయంలో ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా నష్టపోయాం. అప్పటి నుంచి సుప్రీంకోర్టు, హైకోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. మాకు అనుకూలంగా తీర్పులు వచ్చాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం హర్షణీయం.

– గంగాధర్,సుద్దాల రాజేశ్వర్, డీఎస్సీ–2008 బాధిత అభ్యర్థులు

ఎట్టకేలకు షురూ..!

- మీసేవ కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు
- తహసీల్దార్ కార్యాలయాల్లో పేర్ల తొలగింపు
- మార్పులు, చేర్పులకూ అవకాశం



భైంసా తహసీల్ కార్యాలయంలో పేర్లు తొలగిస్తున్న సిబ్బంది

జిల్లాలో ప్రస్తుతమున్న రేషన్‌కార్డులు...	
అంత్యోదయ కార్డులు	12,827
తెల్లరేషన్ కార్డులు	1,09,601
మొత్తం కార్డులు	2,08,626
మొత్తం లబ్ధిదారులు	6,41,286

భైంసాటౌన్: రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ లేకపోవడం, పాతవాటిలో పేర్ల తొలగింపు, కొత్తగా పిల్లల చేర్పుపై ఎలాంటి దరఖాస్తులు స్వీకరించలేదు. కొత్తగా పెళ్లయిన జంటలకు రేషన్‌కార్డులు జారీ చేయలేదు. దీంతో ఎంతోమంది రేషన్‌కార్డుల్లో పిల్లల పేర్ల చేర్పు, కొత్తజంటలు కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించినా, చాలామందికి కార్డులు జారీ కాలేదు. పేర్ల చేర్పు, తొలగింపులు కూడా జరుగలేదు. ఎట్టకేలకు మీసేవ కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డులతోపాటు మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. దీంతో ఇటు మీసేవ కేంద్రాలు, అటు తహసీల్దార్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి.

తహసీల్ కార్యాలయాల్లో తొలగింపు..

మీసేవ కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. కొత్తగా పెళ్లయినవారు తమ తల్లిదండ్రులతో ఉన్న పాత కార్డులో పేర్ల తొలగింపు కోసం తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. తహసీల్దార్ లాగిన్‌లో పేర్ల తొలగింపు చేస్తుండడంతో, ముందుగా పాత రేషన్‌కార్డులో పేర్లు తొలగింపజేసుకుంటున్నారు. అనంతరం మీసేవ కేంద్రాలకు వెళ్లి కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారు మీసేవలో దరఖాస్తు చేయాల్సిన అవసరంలేదని అధికారులు చెబుతున్నా.. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుల కోసం బారులు తీరుతున్నారు.

పేర్ల చేర్పునకూ ఆప్షన్..

కొత్త రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పులకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుల ప్రక్రియ మొదలవడంతో ఎంతోమంది తమ పిల్లల పేర్ల చేర్పు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు ఒక యూనిట్‌పై ఆరు కిలోల బియ్యం అందిస్తోంది. చాలామందికి పిల్లలు కలిగినా పేర్లు చేర్చకపోవడంతో బియ్యం అందుకోలేకపోయారు. ప్రస్తుతం పేర్ల చేర్పు కోసం ఆప్షన్ ఇవ్వడంతో పిల్లల ఆధార్ వివరాలతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు.

జారీ ఎప్పుడో...!

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తున్నా.. కొత్త కార్డులు ఎప్పుడు జారీ అవుతాయో అన్న అనుమానాలు దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు వార్డు సభల్లో, ప్రజాపాలన వేదికల్లో దరఖాస్తులు ఇచ్చినా, ఇటీవల ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టినా చాలామందికి కార్డులు జారీ కాలేదు. ప్రస్తుతం మీసేవలో దరఖాస్తుల స్వీకరణ మొదలైనా.. కార్డులు చేతికి ఎప్పుడొచ్చేనో అని పేర్కొంటున్నారు.

ఆర్జీయూకేటీలో చర్చాగోష్ఠి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న గంగవ్వ



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు..

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీలో ఇన్ఫ్యూజన్ టాక్స్ 2, మై విలేజ్ షో బృందం చర్చాగోష్ఠి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తెలంగాణలోని అత్యంత ప్రసిద్ధ డిజిటల్ సృష్టికర్తలు, వ్యవస్థాపకులను ఒకచోట చేర్చిన ప్రేరణాత్మక కార్యక్రమని ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ అన్నారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ ఆదేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. 2 వేల మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బిగ్బాస్ ఫేమ్ గంగవ్వ, మైవిలేజ్ షో వ్యవస్థాపకుడు శ్రీకాంత్, కీలక సభ్యుడు చందు, ఇన్‌స్టాగామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ స్టీఫెన్ భాను హాజరయ్యారు. సెషన్‌లో స్పీకర్లు తమ స్ఫూర్తిదాయకమైన కథలు, సవాళ్లు కంటెంట్ సృష్టి, వ్యవస్థాపకత, డిజిటల్ వృద్ధిపై విలువైన విషయాలను పంచుకున్నారు. ప్రశ్నోత్తరాల సెషన్ విద్యార్థులు అతిథులతో నేరుగా సంభాషించడానికి వీలు కల్పించి ఈవెంట్‌ను ఆకర్షణీయంగా మార్చారు.విద్యార్థులు కథ చెప్పడానికి ఉత్సాహం కనబర్చారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, డాక్టర్ రాకేశ్‌రెడ్డి, ఐఐఈడీ కోఆర్డినేటర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

- ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

నిర్మల్ రూరల్: విద్యార్థుల ప్రగతిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డీఈవో కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాలను తప్పక పాటించాలన్నారు. విద్యార్థుల ప్రగతికి ప్రధానోపాధ్యాయుల సేవలు తోడ్పడుతాయన్నారు. జిల్లాలో అపార్ నమోదు, యూడైస్ ప్లస్ వివరాల నమోదును పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, రిపోర్టుల నిర్వహణ, ఎల్ఐపీ తదితర వివరాల నమోదు వివరాలు తెలుసుకున్నారు. 10వ తరగతి ఫలితాలు, ఎఫ్ఎల్ఎన్ నిర్వహణ అంశాలపై చర్చించారు. పది ఫలితాల్లో జిల్లాను ఈసారి కూడా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని సూచించారు. డీఈవో రామారావు మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు ప్రతీ పాఠశాలను సందర్శించి వివరాలను సజావుగా నమోదు చేయాలన్నారు. సమీక్షలో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, కోఆర్డినేటర్లు రాజేశ్వర్, నరసయ్య, ప్రవీణ్, లింబాద్రి పాల్గొన్నారు.



హాజరైన ఉపాధ్యాయులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



పరిసరాలు శుభ్రం చేస్తున్న డీపీవో శ్రీనివాస్

సారంగాపూర్: ప్రతీ గ్రామం పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ గ్రామంలోనూ ప్రజలు స్వచ్ఛందంగా తమ గ్రామం బాగుకోసం, స్వచ్ఛదనం కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో పంచాయతీ కార్మికులతోపాటు మండల అధికారులు, పాఠశాల సిబ్బందితో కలిసి పరిసరాలు శుభ్రం చేశామని అన్నారు. వారానికి రెండురోజులు కేటాయిస్తే పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉండి ప్రజలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్, ప్రిన్సిపాల్ సంగీత, సిబ్బంది గోవర్ధన్, టీచింగ్ సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లు అందుకుంటున్న జిల్లా కిక్ బాక్సింగ్ క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన నాలుగో అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నిర్మల్ జిల్లాకు చెందిన అక్షయ, నాగలక్ష్మి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వరుసగా వెండి, కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్ర జట్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో బుధవారం అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జనరల్ సెక్రెటరీ మహిపాల్, శిక్షకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో..

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 8 నుంచి జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పట్టణంలోని రవి ఉన్నత పాఠశాల విద్యార్థి అనుముల శ్రీవైష్ణవి అండర్–13 బాలికల విభాగం సింగిల్స్, డబుల్స్‌లో ప్రతిభ కనబర్చింది. ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీవైష్ణవిని పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న క్రీడా నిర్వాహకులు